విపత్తులో పశుసంపదకూ రక్షణ కల్పించాం

- నియోజకవర్గంలో 60 మెట్రిక్ టన్నుల ఉచిత పశుదాణా
- రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


ఉచిత పశుదాణాను పాడి రైతులకు అందజేస్తున్న మంత్రి కాకాణి, జేడీ మహేశ్వరుడు

పొదలకూరు : మిచాంగ్ విపత్తులో పశుసంపదకు సైతం రక్షణ కల్పించ గలిగామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు మండలం దుగ్గుంట పంచాయతీ కొత్త కంభాలపల్లి తెలుగుగంగ పునరావాస కేంద్రంలో ఉచిత పశుదాణాను పాడిరైతులకు జేడీ మహేశ్వరుడుతో కలిసి మంత్రి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫానులో మనుషులను కాపాడేందుకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసిన విధంగానే పశువులకు సైతం ప్రత్యామ్నాయాన్ని కల్పించి కాపాడాలని జిల్లా సమీక్షలో సూచించినట్లు వివరించారు. ముందు జాగ్రత్తల వల్ల పశునష్టం జరగలేదన్నారు. విపత్తు తర్వాత గేదెలు, మేకలు, గొర్రెలు, ఆవులు అంటు వ్యాధులకు గురికాకుండా టీకాలు వేయిస్తున్నట్లు తెలిపారు. 856 పశువులకు వైద్య పరీక్షలను నిర్వహించామని, 1,450 పశువులకు టీకాలు వేశామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో పొదలకూరు, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, మనుబోలు మండలాల్లో 60 మెట్రిక్ టన్నుల ఉచిత దాణాను పాడిరైతులకు అందజేశామని వివరించారు. జిల్లా, నియోజకవర్గంలో అదనంగా దాణా అవసరమైతే జేడీతో మాట్లాడి దిగుమతి చేసుకుంటామన్నారు. పాడిరైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. అనంతరం రైతులకు పశు ఆరోగ్య పరిరక్షణ కార్డులను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పొదలకూరు ఏడీఏ డాక్టర్ అరుణ, ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నిర్మలమ్మ, సర్పంచ్ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ


విత్తనాలను అందజేస్తున్న మండల ఏఏబీ చైర్మన్ చెంగారెడ్డి

ముత్తుకూరు : మిచాంగ్ తుపాను సృష్టించిన బీభత్సం వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మండలంలో సుమారు 5,000 ఎకరాల్లో వరి నారుమడులు వరద నీటిపాలైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి ఆధ్వర్యంలో శనివారం నుంచి ఆర్బీకేల్లో సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేపట్టారు. ఇందులో భాగంగా కేఎన్ఎం 1638 రకం, ఎన్ఎల్ఆర్ 34449 రకం వరి విత్తనాలను 80 శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేశారు. మొదటి విడతగా మండలానికి 7 క్వింటాళ్ల విత్తనాలు విడుదల చేశారు.

ఓటర్ల జాబితాను త్వరగా పూర్తి చేయండి


మాట్లాడుతున్న ఓబులేసు

మనుబోలు : ఓటర్ల జాబితాను త్వరితగతిన పూర్తి చేయాలని స్పెషల్ కలెక్టర్ ఓబులేసు బీఎల్వోలకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బీఎల్వోలతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పు చేర్పులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే గడువు ముగిసినా కొత్త ఓటర్ల దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. అనంతరం ఓటర్ల జాబితాను సిద్ధం చేయడంపై తహసీల్దార్ శివకృష్ణయ్యకు సూచనలు చేశారు.

ప్రభుత్వ సాయం అందజేత


బాధితులకు నగదు అందజేస్తున్న కౌన్సిలర్లు


బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చి నగర పంచాయతీ పరిధిలో 11, 15, 18 వార్డులకు సంబంధించి పునరావాస కేంద్రంలో ఉన్న తుపాను బాధితులకు ప్రభుత్వం తరపున రూ.2,500 నగదును శనివారం అందజేశారు. తుపాను సంభవించిన అతి తక్కువ కాలంలో ప్రభుత్వం నుంచి సహకారం అందడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మోర్ల జయంతి, అనంతమ్మ, నాయకులు భరత్‌కుమార్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆలయంలో పూజలు



కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం దళితవాడలో కోదండరామస్వామి ఆలయ మొదటి వార్షిక వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, కళ్యాణి దంపతులు స్వామివారికి హోమాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సచివాలయ మండల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): గాంధీ గిరిజన కాలనీలోని మహాలక్ష్మమ్మ ఆలయంలో భజన కార్యక్రమాలను అయ్యప్ప భక్తులు శనివారం నిర్వహించారు. అనంతరం వీరికి అన్నప్రసాదాన్ని అందజేశారు. ఉభయకర్తలుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత బాగి వెంకటరమణ, వెంకటరవి, విజయలక్ష్మి, వెన్నెల వ్యవహరించారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికే లోక్‌అదాలత్


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి చైతన్య

కోవూరు : పెండింగ్ కేసుల పరిష్కారానికే లోక్‌అదాలత్‌లను నిర్వహిస్తున్నామని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి పి.చైతన్య అన్నారు. కోవూరులోని కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులకు పూర్తిస్థాయిలో చట్టభద్రత ఉంటుందన్నారు. అడిషనల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మ్యాజిస్ట్రేట్ జె.కాత్యాయణి లోక్ అదాలత్‌కు సంబంధించిన పలు విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- సీడీపీఓ జ్యోతి



కోవూరు: కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో తొమ్మిది అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హత కలిగి న అభ్యర్థులు 19వ తేదీ సాయంత్రంలోగా దరఖా స్తులు పంపాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పి.జ్యోతి శనివారం తెలిపారు. కోవూరు మండలానికి సంబంధించి కోవూరు అరుంధతీయవాడ(ఎస్సీ), వేగూరు–2 (ఓసీ), పాటూరు 1 (ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో గాంధీనగర్ మెయిన్ (ఓసీ), కొడవలూరు మండలంలో దామేగుంట (ఓసీ), రామన్నపాళెం (ఎస్సీ), సౌత్ గండవరం పంచాయతీలో చింతచెలిక (ఓసీ), యల్లాయపాళెం–2 (ఓసీ), విడవలూరు మండలంలో వావిళ్ల (ఎస్సీ) అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు సంబంధించి అర్హత గల వారు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత కలిగి జూలై 1 నాటికి 21 నుంచి 35 ఏళ్ల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి ఆయా పంచాయతీల్లో నోటీసులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

మనుబోలు పరిధిలో..

మనుబోలు : మండల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మనుబోలు పంచాయతీలో కేఆర్‌పురం, కొలనకుదురు దళితవాడ, అక్కంపేటలో టీచర్ పోస్టుల కు,అలాగే వెంకన్నపాళెంలో ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. పూర్తి వివరాలకు వెంకటాచలం సెక్టార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పునరావాస కేంద్రాలపై అసత్య కథనాలు తగదు


మాట్లాడుతున్న దంపూరు గిరిజనులు

విడవలూరు : తుపాన్ బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలపై తప్పుడు కథనాలను ప్రచురించడం తగదని మండలంలోని దంపూరు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తుపాన్ కారణంగా గిరిజన కాలనీలో ఉన్న దాదాపు 70 మందిని స్థానిక సచివాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారని, అక్కడ మూడు రోజుల పాటు సర్పంచ్ సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మంచి ఆహారం అందించారన్నారు. ఇంటికి వచ్చే సమయంలో కూడా సర్పంచ్ సొంత నిధులతో అందరికీ బియ్యం పంపిణీ చేశారన్నారు. దీనిపై అసత్య కథనాలను ప్రచురించడం తగదని, ఇప్పటికైనా నిజాలు తెలుసుకోవాలని హితవు పలికారు.

పూచీకత్తు లేని రుణాలతో స్వయం ఉపాధి


తలమంచిలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, నేతలు

- ఈఓపీఆర్డీ డేవిడ్

కొడవలూరు : ప్రభుత్వం అందజేసే పూచీకత్తు లేని రుణాలతో స్వయం ఉపాధి పొందవచ్చని ఈఓపీఆర్డీ వి.డేవిడ్ సూచించారు. మండలంలోని తలమంచిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా కార్డులు, ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా పూచీకత్తు లేని రుణాలు పొందేలా పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటి ద్వారా రూ.2 లక్షల వరకు రుణం పొందే వెసులుబాటు ఉందన్నారు. ఇందుకోసం విశ్వకర్మ సంకల్ప యోజన, ఎంఎస్ఎంఈ, పీఎంఈజీపీ, కేవీసీ తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంకల్ప యాత్ర జిల్లా కన్వీనర్ ఎం.రాధాకృష్ణగౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలపై అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పొదుపు సంఘాలకు రుణాల చెక్కులను పంపిణీ చేయడంతో పాటు డ్రోన్‌లతో ఎరువులు, పురుగు మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.భాస్కర్, బీజేపీ నేతలు కె.రాజేశ్వరమ్మ, విజయశ్రీ, రాఘవేంద్రరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వన భోజనాలు నేడు

నెల్లూరు(బృందావనం): కార్తీక మాస పూజ, వన భోజనాలను రంగనాయకులపేటలోని బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించనున్నామని వైఖానస సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి ఉదయగిరి వెంకటశేషాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్పగిరి రంగనాథస్వామి, విఖానస మహర్షికి పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పారు. జిల్లాలోని వైఖానస సంఘీయులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

శంకరమఠంలో మహాలింగార్చన నేడు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శంకరమఠంలో మహాలింగార్చనను ఆదివారం సాయంత్రం ఆరుకు నిర్వహించనున్నామని నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహామృత్యుంజయ పాశుపత హోమాన్ని మంగళవారం నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

నేడు మండలంలో మంత్రి కాకాణి పర్యటన

మనుబోలు : మిచాంగ్ తుపాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హరగోపాల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరదలకు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలిస్తారని వివరించారు. ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావాలన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీలో గర్భిణులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ అహ్మద్‌బాబు మాట్లాడారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. సలహాలు, సూచనలు అందించి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బంది సుబ్బారావు, సుబ్బమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈకి సన్మానం



కోవూరు : తుపాన్ సమయంలో విశేష సేవలు అందించిన ఇనమడుగు ట్రాన్స్‌కో ఏఈ రమేష్ బాబును ఘనంగా సత్కరించారు. మండల పరిధిలోని ఇనమడుగులో ఉన్న సత్యానంద ఆశ్రమంలో ఆదివారం ఆయన్ను శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం గ్రామస్తులు ఏఈని అభినందించారు.

కార్తీక దీపోత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): కార్తీక మాస బహుళ త్రయోదశిని పురస్కరించుకొని మైపాడు గేట్‌లోని తెప్పోత్సవ ఘాట్ వద్ద కార్తీక దీపోత్సవాన్ని ఆదివారం సాయంత్రం ఆరుకు నిర్వహించనున్నామని మద్దూరు సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరుకు శివలింగ ప్రతిష్ఠ, అభిషేకాలు, సాయంత్రం ఆరు గంటలకు శివపార్వతుల అలంకారం, తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పా రు. భక్తులు తరలిరావాలని కోరారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఉడ్‌హౌస్‌సంఘంలో పేకాటాడుతున్న 11 మందిని నవాబుపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వివరాలు.. ఉడ్‌హౌస్‌సంఘంలోని ఓ గదిలో పలువురు పేకాటాడుతున్నారనే పక్కా సమాచారం ఇన్‌స్పెక్టర్ బాబీకి అందింది. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. 11 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.51,200ను స్వాధీనం చేసుకున్నారు.

బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా వీరానాయక్

నెల్లూరు(క్రైమ్): బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములునాయక్‌ను రేంజ్ కార్యాలయానికి బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు ఉత్తర్వులను శనివారం జారీ చేశారు. బాపట్ల సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వీరానాయక్‌ను ఈయన స్థానంలో నియమించారు.

ఘంటసాల జయంతి నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఘంటసాల జయంత్యుత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నామని నిర్వాహకుడు నీలకంఠం శ్రీనివాసులురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్లెపాటల జానపద కళాకారుడిగా పేరొందిన బోనెల అసిరయ్యను సత్కరించనున్నామని చెప్పారు.

భస్మాభిషేకం నేడు

నెల్లూరు(బృందావనం): కార్తీక మాస త్రయోదశిని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో భస్మాభిషేకాన్ని ఆదివారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నామని ఈఓ వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పారు.

అధికారుల సేవలు భేష్


రైతులకు సబ్సిడీ విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : తుపాను సమయంలో మండల పరిధిలో అధికారులు, సిబ్బంది అందించిన సేవలు భేష్ అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కొనియాడారు. బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. దెబ్బతిన్న పంటల వివరాలు, తాగునీటి సరఫరా, విద్యుత్ పునరుద్ధరణ తదితర అంశాల గురించి అధికారులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది. వలంటీర్లు ముందస్తు చర్యలు చేపట్టి నష్టం వాటిల్లకుండా చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన నిత్యావసర సరుకులు, నగదు అందించి బాధితులను ఆదుకున్నారని కొనియాడారు. అనంతరం నారుమడులు దెబ్బతిన్న రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు అందిస్తా

తుపాన్ సమయంలో నగర పంచాయతీ పరిధిలోని కోనేటిమిట్ట ప్రాంతంలో షేక్ నూర్జహాన్ ఇంటిపై చెట్టు కూలడంతో ఆమెకు తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయాన్ని నాయకులు అధికారులు శనివారం ఎమ్మెల్యే ప్రసన్న దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బాధిత కుటుంబానికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.2 లక్షలు అందిస్తామని తెలిపారు.

15 నుంచి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

- రిజిస్ట్రేషన్ చేసుకోండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

మనుబోలు : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా'కు ఆసక్తి ఉన్న వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. ఆయన శనివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ 15వ తేదీ నుంచి 2024 ఫిబ్రవరి 8వ తేదీ వరకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నీకాయిట్, మారథాన్ పోటీలతో పాటు యోగా క్లాసులు కూడా నిర్వహిస్తారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 15 సంవత్సరాల పైబడిన వారు అర్హులని వివరించారు. గెలుపొందిన వారు మండల స్థాయి నుంచి నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. నియోజకవర్గం నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీల్లో రాణించిన వారికి దశల వారీగా రూ.20 వేల నుంచి రూ.5 లక్షల వరకు బహుమతులు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గనే ఆన్‌లైన్‌లో లేదా, 1902 నంబర్‌కు కాల్ చేసి గ్రామ వలంటీర్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

బైక్, లారీ ఢీ

- యువకులకు తీవ్రగాయాలు



కోవూరు : మండల పరిధిలోని రామన్నపాళెం గేట్ సమీపంలో రాజుపాళెం నుంచి కోవూరు వైపు వస్తున్న మోటార్ బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. చరణ్, హుస్సేన్ అనే ఇద్దరు విద్యార్థులు బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో రామన్నపాళెం గేట్ సమీపంలో లారీ ఢీకొనడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు.

క్రీడా దుస్తుల పంపిణీ


దాత అందజేసిన క్రీడా దుస్తుల్లో విద్యార్థులు

ఇందుకూరుపేట : మండలంలోని ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులకు శనివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఇందుకూరుపేటకు చెందిన దాసరి విజయ్‌కుమార్ తన సతీమణి సుహాసిని జ్ఞాపకార్థం వీటిని పాఠశాల ప్రిన్సిపల్ జనార్దన్‌రావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు


గ్రామాల్లో వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

- మిచాంగ్ ప్రభావంతో నిండిన చెరువులు

పొదలకూరు : రబీ సీజన్‌కు వరినాట్లు ఆశించిన స్థాయిలో పడవని తొలుత రైతులు భావించారు. అయితే అనూహ్యంగా మిచాంగ్ తుఫాను ప్రభావం వల్ల ఒక్క రాత్రికే చెరువులన్నీ నిండాయి. ఫలితంగా గ్రామాల్లో కాలువల నుంచి అందే సాగునీటి కోసం ఎదురు చూడకుండా రైతులు నాట్లు వేస్తున్నారు. ముందుగా నార్లు పోసుకున్న రైతులు సకాలంలో నాట్లు పూర్తి చేసుకుంటున్నారు. మండలంలోని డేగపూడి, పెదరాజుపాళెం, తాటిపర్తి, మహ్మదాపురం, విరువూరు, సూరాయపాళెం, వెలికంటిపాళెం, నేదురుమల్లి తదితర గ్రామాల్లో ముమ్మరంగా వరినాట్లు చేపడుతున్నారు. మండలంలోని రైతులకు సోమశిల దక్షిణ, నెల్లూరు, కనుపూరు, కండలేరు ఎడమగట్టు, ఒకటో నంబరు బ్రాంచి కాలువలు, విరువూరు సప్లైచానల్ ద్వారా సాగునీరు అందుతోంది. ఫలితంగా రబీలో వరిసాగుకు సమస్యలు ఎదురయ్యే అవకాశమే లేదు. మిచాంగ్ వల్ల చెరువుల్లోకి నీరు రావడంతో ఈ రబీలో మండలంలో 20 వేల ఎకరాలకు పైబడి నాట్లు పడే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. సంక్రాంతి వరకు మండలంలో నాట్లు వేసే అవకాశం ఉంది.